నమ్మించి నట్టేట ముంచారు

- ఒక్క పథకాన్నీ అమలుచేయలేదు
- వెన్నుపోటు దినంలో కదంతొక్కిన వైఎస్సార్ సీపీ నాయకులు
- నల్లచొక్కాలతో నిరసన


వెన్నుపోటు దినం సందర్భంగా నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బోట్‌క్లబ్: సూపర్ సిక్స్‌తో సహా 149 హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి, ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రభుత్వం ఏడాదిగా హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసాలపై వైఎస్సార్ సీపీ ఉద్యమబాట పట్టింది. దీనిలో భాగంగా బుధవారం వెన్నుపోటు దినంగా పాటించాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సిటీ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, నల్లచొక్కాలు ధరించి నిరసన తెలిపి ఆర్డీఓ మల్లిబాబుకు వినతిపత్రం సమర్పించారు. కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో– ఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికి ఆ తల్లి ఖాతాలో వేస్తామని చంద్రబాబు నమ్మబలికారన్నారు. ఇప్పటి వరకూ ఈ పథకం కింద ఏ ఒక్క లబ్ధిదారునికి డబ్బులు ఇచ్చిన పాపాన పోలేదు. తల్లికి వందనం పేరుతో తల్లులకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారన్నారు. ఆడబిడ్డ నిధి కింద 19 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు వయసు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు అందిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటి వరకూ ఆడబిడ్డ నిధి ఊసే లేదన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామని నమ్మబలికి గత ఏడాది కొందరికి ఒక సిలెండర్‌తో సరిపెట్టారన్నారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి ఆ మాట సైతం మరిచారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తామని ఇప్పటి వరకూ ఏ రైతుకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఉచిత పంట బీమా, పంట నష్టపరిహారం వంటి పథకాలు అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని దానినీ విస్మరించారన్నారు. నిరుద్యోగులకు ప్రతి నెల రూ.3 వేలు చొప్పున భృతి ఇస్తానని దానినీ గాలిలో కలిపేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, రాష్ట్ర మహిళా కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి కిశోర్, రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షులు రావూరి వేంకటేశ్వరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు అల్లి రాజబాబు, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షులు ఆదిత్యకుమార్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు చెక్కా చక్రవర్తి, సిటీ యూత్ అధ్యక్షుడు రోకళ్ల సత్యనారాయణ, అనుబంధ విభాగం అధ్యక్షుడు వాసుపల్లి కృష్ణ, గాదెపల్లి దాసు, కర్రి అనంత, హేమంత్, కంపర బాబి, బల్ల సూరిబాబు, ఎన్‌వీ సాయిబాబు, బెజవాడ బాబీ, చిక్కాల సుధాకర్, మన్యం బాబీ, పితాని శ్రీనివాస్, మీసాల నికేష్, సుభద్ర , మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆర్డీఓ మల్లిబాబుకు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

ఏడాదిలో చేసిందేమిటి చెప్ప 'బాబూ'

రాష్ట్రంలో ఎన్నికలు జరిగి ఏడాదైంది. ఈ ఏడాది కాలంలో కూటమి సర్కార్ ఏమి చేసిందని చంద్రబాబును అడిగితే వెన్నుపోటు తప్ప ఏమీ కనిపించదు. నమ్మించి మోసం చేయడం, నమ్మిన వారిని నట్టేట ముంచడం, ఇష్టానుసారం పాలన చేయడం . ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన బెట్టి సొంతంగా ఒక రాజ్యాంగం రాసుకుని పోలీసు, ఇతర వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేయాలని అక్రమ కేసులు పెట్టి చాలా ఇబ్బంది పాలు చేస్తున్నారు. ఎక్కడ చూసినా హత్యలు, మహిళలపై అరాచకాలు, గంజాయి పెరిగిపోయింది. ఎక్కడ చూసినా ప్రజల్లో అశాంతి నెలకొంది. ఒక్క సంక్షేమ పథకం లేదు. ఎన్నికల ముందు జగన్ పథకాలు కొనసాగిస్తామన్నారు. ఇప్పుడు అమ్మ ఒడి ఏమైంది, రైతు భరోసా ఏమైంది, ఆడబిడ్డ నిధి ఏమైంది? నీకు రూ.15 వేలు అని ప్రచారం చేశారు. ఇవన్నీ ఏమయ్యాయి. ఉచిత పంట బీమా ఎక్కడుంది. జగన్‌మోహన్‌రెడ్డి రీ సర్వే చేస్తే తప్పు అని, భూమి లాక్కొంటారని ప్రచారం చేశారు. ఈ వేళ మీరేం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే పగలకొట్టాలని లోకేష్ పిలుపు ఇచ్చారు. ఈ వేళ అవే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. వీటన్నింటికీ సమాధానం చంద్రబాబు చెప్పాలి.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్

ఏడాది పాలనంతా వెన్నుపోటే!

- హామీల అమలును విస్మరించిన కూటమి సర్కారు
- పాలన తీరును నిరసిస్తూ కదం తొక్కిన శ్రేణులు
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసనల వెల్లువ
- నియోజకవర్గ కో ఆర్డినేటర్ కన్నబాబు ఆధ్వర్యంలో డీటీకి వినతి పత్రం అందజేత


కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో కదం తొక్కిన పార్టీ శ్రేణులు


ఎండీయూ వాహనంపై జగన్ స్టిక్కర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న ఆపరేటర్లతో కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: ఎన్నికల ముందు హామీల వరద గుప్పించిన కూటమి సర్కారు ఏడాది పూర్తయినా వాటిని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచింది. ఈ తీరుపై సర్కారు మోసాన్ని ఎండగడుతూ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కాయి. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటరు, మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పెద్ద ఎత్తున సర్పవరం జంక్షన్‌కు చేరుకున్న ప్రజలు, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు, పార్టీ జెండాలు చేత బూని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీరును నిరసించారు. మోసకారి, దోపిడీ ప్రభుత్వం మాకొద్దంటూ నినాదాలు చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినదించారు. సర్పవరం జంక్షన్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాటం సాగిస్తామన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వంపై ఇంతలా వ్యతిరేకత వస్తుందనుకోలేదని, అన్ని వర్గాలు ప్రజలు చంద్రబాబు ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, సంక్షేమ పథకాలన్నింటిని అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు సూర్యప్రకాశరావు, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు అల్లి రాజబాబు, మాజీ మేయర్ పి.సరోజ, పంతం ఇందిర, చింతా ఈశ్వరరావు, నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు గోపుశెట్టి బాబ్జీ, తోటకూర శ్రీనివాస్, కొప్పిశెట్టి గణేష్, పుల్ల చందు, పల్లంరాజు, నందిపాటి ధర్మరాజు, తుమ్మలపల్లి చంటిబాబు, నందిపాటి ఆది, వీధి విజయసారథి, పబ్బినీడి పాపారావు, కమిడి శంకర్, జాన్ ప్రభాకర్, కరీం బాషా, స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న రూరల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు తదితరులు

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ సరకులు అందించేందుకు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎండీయూ వాహనాలను తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం ఆ వాహనాలను రద్దు చేసి, రేషన్ దుకాణాల ద్వారా సరకుల సరఫరాను పునఃప్రారంభించడంతో ఆయా ఆపరేటర్లు ఉపాధిని కోల్పోయారు. బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ఎండీయూ వాహనాలతో హాజరైన నిర్వాహకుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు సిద్ధాంతపు రవికుమార్, అల్లంపల్లి దైవపాల్, కడియాల సూర్య కిరణ్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. వాహనంపై అప్పటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ కన్నబాబుతో కలిసి పాలాభిషేకం చేశారు.


క్లుప్తంగా

సైన్స్ ఒలింపియాడ్‌లో గీతమ్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ సుజ్ఞాన్, ప్రిన్సిపాల్ శారద

బాలాజీచెరువు: సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన పరీక్షల్లో కాకినాడ గీతమ్ విద్యార్థులు ప్రతిభ చూపారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో ఇంగ్లీష్ ఒలింపియాడ్ విభాగంలో డి.భువన (7వ తరగతి)టి.వసంత (9వతరగతి) 3వ ర్యాంక్ సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఢిల్లీలో ఒలింపియాడ్ డైరెక్టర్ మహావీర్‌సింగ్ సమక్షంలో రూ.10 వేలు నగదుతో పాటు, మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం పాఠశాల డైరెక్టర్ సుజ్ఞాన్, ప్రిన్సిపాల్ సురభిశారద అభినందించారు.

అలయన్స్ క్లబ్ క్యాబినెట్ సమావేశం


వేదికపై మాట్లాడుతున్న క్లబ్ సభ్యులు

బాలాజీచెరువు: జిల్లా అలయన్స్ క్లబ్ నూతన క్యాబినేట్ ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక విద్యుత్‌నగర్ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో గవర్నర్ పెంకే గోవిందరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డీటీ శాస్త్రి, 3వ వైస్ ప్రెసిడెంట్ కె.రాజేశ్వరరావు, డైరెక్టర్ గాంధీ, ఇన్నర్ వీల్ కమిటీ సభ్యుడు డాక్టర్ చప్పిడి వేంకటేశ్వరరావు హాజరై క్లబ్ విధి విధానాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో కె.మునిరెడ్డి, దిలీప్ కుమార్ సదనాని, మద్దా వికాస్ పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్య సమస్య పరిష్కరించండి

పెద్దాపురం: పట్టణంలో ఉన్న మంచినీటి సమస్య, పారిశుధ్య సమస్యను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం పెద్దాపురం మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. బుధవారం సీపీఎం కమిటీ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ 60 వేల పైబడి జనాబా కల్గిన పట్టణంలో విస్తరణ పెరిగిందని, ఊరి చివరి ప్రాంతాల సంఖ్య మురుకివాడల సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. పట్టణంలో గోదావరి నీరు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. పట్టణంలో మంచినీటి సమస్య, పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ మంచినీటి కోసం రూ.37 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలో మంచినీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, సీపీఎం నాయకులు సిరపురపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ., రొంగల వీర్రాజు, అప్పన్న పాల్గొన్నారు.

చారిత్రక ఘనత నిలిచేనా..

- న్యాక్ ఏ ప్లస్ దిశగా పీఆర్ కళాశాల అడుగులు
- ప్రైవేటు విద్యా సంస్థలకు తీసిపోని క్రేజ్
- ఈ నెలలో అడ్మిషన్లకు నోటిఫికేషన్


పీఆర్ డిగ్రీ కళాశాల

బాలాజీచెరువు: నగరంలో పేరొందిన విద్యాలయాల్లో పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకటి. నగర నడిమధ్యలో పిఠాపురం రాజావారు దానం చేసిన దాదాపు 35 ఎకరాల విస్తీర్ణంలో 1852వ సంవత్సరంలో పాఠశాల స్థాయి, 1866లో ఉన్నత పాఠశాల, 1926లో ఇంటర్మీడియెట్, 1952 డిసెంబర్ 12న డిగ్రీ కళాశాలగా నిర్మాణమయ్యాయి. అంచెలంచెలగా పాఠశాల నుంచి ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ కళాశాల స్థాయి వరకూ ఎదిగి లక్షల మందికి సరస్వతీ నిలయంగా ఖ్యాతి గడించింది. నేటికీ కార్పొరేట్ కళాశాల తరహాలో ఈ కళాశాలలో అడ్మిషన్‌కు క్రేజ్ ఉందంటే దీని స్థాయి ఎంతటిదో తెలుస్తుంది. కళాశాల నుంచి స్వయం ప్రతిపత్తిగల కళాశాలతో పాటు 2017లో నాక్ ఏ గ్రేడ్‌కు చేరి యూనివర్సిటీ స్థాయికి ఎదిగింది. రెగ్యులర్ విద్యతో పాటు ఏయూ, అంబేడ్కర్ స్టడీ సెంటర్లను ఇదే ప్రాంగణలో కొనసాగిస్తూ ఏటా వేలాది మందిని పట్టభద్రులుగా తీర్చిదిద్దుతున్న విద్యాలయంగా వర్ధిల్లుతోంది. సినీ, రాజకీయ, వ్యాపార రంగాలలో స్థిరపడి ఉన్నత స్థానాలకు ఎదిగిన వారెందరో ఈ విద్యాలయంలో ఓనమాలు నేర్చుకున్నవారున్నారు. రాజకీయ రంగంలో దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి, కేంద్రమంత్రి సంజీవరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడుతో పాటు జిల్లాకు చెందిన శాసనసభ్యులు పది మంది ఉన్నారు. కళారంగం నుండి ఎస్వీరంగారావు, రావు గోపాలరావు, హరనాథ్, విజయచందర్, గౌతంరాజు, పీబీ శ్రీనివాస్, వీవీ రాజేంద్రప్రసాద్, సాహిత్య రంగంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి, తాపీ ధర్మారావు, ఐవీ చలపతిరావు, శాంతా బయోటెక్స్ అధినేత బీవీ మోహనరెడ్డి, ఏఎన్‌యూ మాజీ వీసీ ఎంవీ రావు, విశ్రాంత ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ఆర్ మూర్తి, నళినీమోహన్ వంటి ఐఏఎస్ అధికారులు ఇక్కడ నుంచే ఓనమాలను ప్రారంభించారు. కళాశాల ప్రారంభంలో స్థాపించిన భవనాన్ని స్మారక భవనంగా ఉంచి పిఠాపురం రాజా వారి పేరుతో గ్రంథాలయంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ ఆ భవనం చెక్కుచెదరకుండా ఆ కాలంలో రూపొందించిన డిజైన్, హంగులతో సాంస్కృతిక భవనంగా కళాశాల ప్రవేశంలో దర్శనమిస్తుంది. ఇది ఇలా ఉంటే గత ప్రిన్సిపాల్ తిరుపాణ్యం ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు గత ఏడాది న్యాక్ బృందం సందర్శించి ఏ హోదాలో ఉన్న గ్రేడ్‌ను బీ ప్లస్‌ప్లస్‌కు కుదించారు. దీంతో కళాశాలకు ఉన్న చరిత్ర కాస్త వసివాడింది. సాధారణంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీట్లు అంటే కనీసం 20 శాతం అయినా ఏటా ఖాళీగా ఉంటుంటాయి. అటువంటిది ఇక్కడ ఉన్న దాదాపు 400 సీట్లకు 3 వేల వరకూ దరఖాస్తులు వస్తున్నాయంటే ఇక్కడ అడ్మిషన్‌కు ఏ స్థాయిలో క్రేజ్ ఉందో అర్థమౌతుంది.

న్యాక్ కమిటీకి మళ్లీ దరఖాస్తు



చరిత్ర కలిగిన కళాశాల యూనివర్సిటీ స్థాయికు వెళ్లే దశలో దాని గ్రేడ్ తగ్గిపోయింది. ఇప్పుడు మళ్లీ మరోసారి కమిటీకు దరఖాస్తు చేసి న్యాక్ బృందానికి ఇక్కడ ఉన్న వసతులు, విద్యా విధానం తదితర అంశాలన్నీ క్షుణ్ణంగా వివరిస్తాం. మళ్లీ ఏ గ్రేడ్ లేదా అంతకు పైగా ర్యాంక్ సాధనకు కృషిచేస్తాం.

డాక్టర్ కందుల ఆంజనేయులు, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

రేపటి నుంచి భీమేశ్వర కల్యాణోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి 12 వరకూ స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వర్రావు బుధవారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 6న రాత్రి 7.30 గంటలకు స్వామి వారి కల్యాణం, 7న ఉదయం స్వామి, అమ్మవారికి అభిషేకం, కుంకుమపూజ, సాయంత్రం బలిహరణ, 8న రాత్రి 7 గంటలకు చందనోత్సవం, 9న సాయంత్రం 6 గంటలకు బలిహరణ, 11న రాత్రి 7 గంటలకు స్వామి వారికి చక్రస్నానం, పూర్ణాహుతి, 12న రాత్రి 7 గంటలకు శ్రీపుష్పయాగం వైభవంగా జరగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

7న ప్రత్యేక యోగా కార్యక్రమం

బోట్‌క్లబ్: ఈ నెల 7న కాకినాడ మెయిన్‌రోడ్డులో 5 వేల మంది ఉపాధ్యాయులతో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ సెంటర్ నుంచి మెయిన్‌రోడ్డు టైటాన్ షోరూమ్ వరకూ ఒక కిలోమీటరు వరకూ ఈ యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల ఆరో తేదీ రాత్రి 8 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 10 గంటలు వరకూ మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ నిలిపివేయనున్నట్లు చెప్పారు. వాహన చోదకులకు, దుకాణ యజమానులకు ముందుగానే తెలియజేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 7న సూర్యకళామందిరంలో 200 మందితో, బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో 300 మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరూ పాల్గొనాలన్నారు.

నీళ్లనుకుని పేల మందుతాగి యువకుడి మృతి

కరప: మంచినీళ్లు అనుకుని పేలుమందు కలిపిన నీటిని తాగడంతో ఓ యువకుడు అపస్మారక స్థితిలోకి వెళ్లి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. మండలం వేళంగి గ్రామానికి చెందిన పెన్నాడ వీరబాబు (38) కాకినాడలోని ఒక ఫిషరీస్ కంపెనీలో పనిచేస్తుంటాడు. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు. వీరబాబు భార్య వెంకటలక్ష్మి పిల్లల తలకు పేలు పట్టకుండా ఉండటానికి కొబ్బరి నూనెలో పేల మందు కలిపి, కిన్లీ సోడా ఖాళీ సీసాలో పోసి, ఉంచింది. ఈ నెల ఒకటో తేదీన సాయంత్రం ఐదు గంటల సమయంలో వీరబాబు నిద్రలేచి, బెడ్‌రూమ్‌లో నుంచి హాలులోకి వచ్చి మంచినీళ్లు అనుకుని పొరపాటున పేల మందు కలిపిన నూనెను తాగేశాడు. ఆ సీసాలో మందునీళ్లు జిగురుగా ఉండటంతో వెంటనే బయటకు వదిలేశాడు. ఆ తర్వాత అతడు వాంతులు చేసుకోవడంతో చికిత్స కోసం అతని భార్య రామచంద్రపురం ఆసుపత్రికి తీసుకువెళ్లింది. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ భూమి కౌలు వేలం


వేణుగోపాలస్వామి భూములు సాగుకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపల్లి: స్థానికంగా వేంచేసియున్న వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించి బుధవారం భూములు మూడేళ్లకు కౌలు వేలం నిర్వహించగా ఆదాయం రెట్టింపు పెరిగింది. ఆలయ ఈవో ధనలక్ష్మి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 14.36 సెంట్లు సాగు భూమికి వేలం నిర్వహించగా గతేడాది 2.24లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.7.33 లక్షల ఆదాయం సమకూరింది. కొత్తపల్లిలోని సర్వే నంబర్‌లో 202,102/3లో గల 7.22 సెంట్ల భూమికి వేలం నిర్వహించగా ఈ ఏడాది 3.60 లక్షలు, వాకతిప్పలో సర్వే నంబర్ 428/2, 420/9లో గల 3.34 సెంట్లకు రూ.1.90 లక్షల ఆదాయం వచ్చింది. కొత్తపల్లిలో సర్వే నంబర్ 9లోని 1.54 సెంట్లకు రూ.52వేలు, ఎండపల్లిలో 238లోని 1.34 సెంట్లకు రూ. 80వేలు, కొత్తపల్లిలో సర్వే నంబర్ 26లోని 0.92 సెంట్లకు రూ.51 వేలు ఆదాయం సమకూరింది. ఈ వేలం పాటలో 42 మంది రైతులు పాల్గొన్నారు. కౌలుదారుల నుంచి ఒక సంవత్సరం శిస్తు సొమ్మును వసూలు చేసి వారికి భూములకు సంబంధించిన కౌలు హక్కును అప్పగించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారులుగా ఈఓ ధనలక్ష్మి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి సరుగుడు తోట కౌలు వేలం పాట

మండలంలోని మూలపేటలో వేంచేసియున్న జగన్నాథస్వామి ఆలయానికి సంబంధించిన 10.28 ఎకరాల సరుగుడు తోట భూమిని ఆలయ ఈఓ ధనలక్ష్మి ఆధ్వర్యంలో వేలంపాటను నిర్వహించారు. 2018లో సరుగుడు తోట పెంచుకునేందుకు 6 ఏళ్లకు వేలం నిర్వహించారు. పెరిగిన సరుగుడు తోటకు బుధవారం వేలం నిర్వహించగా రూ.11 లక్షల ఆదాయం వచ్చింది. దీంట్లో సరుగుడు తోట పెంచిన రైతుకు రూ.5.50 లక్షలు, దేవదాయ శాఖకు రూ.5.50 లక్షలుగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మీ గ్రామోత్సవం


మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సామర్లకోట: స్థానిక గోదావరి నదీ తీరంలో ఉన్న పురాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో వెలసిన మహాలక్ష్మీ అమ్మవారి గ్రామోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి సామూహికంగా పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక గజ వాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

అడ్డుకున్న స్థానికుడిపై దౌర్జన్యం


శ్రీను తీసిన ఫొటోపై వ్యాన్ నంబర్

కరప: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా పార్టీల నాయకుల దోపిడీకి అడ్డూ, అదుపూ లేకుండా పోతోంది. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తుంటే వారిపై సదరు నాయకులు దౌర్జన్యానికి దిగుతున్నారు. కరపలో బుధవారం అర్ధరాత్రి వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలింపును అడ్డుకున్న స్థానికుడిపై అటువంటి దౌర్జన్యమే జరిగింది. కరపలోని సీతమ్మవీధిలో బుధవారం రాత్రి టాటా ఏస్ వెళ్తుండగా స్థానికుడు ఉల్లం శ్రీనుకు అనుమానం వచ్చి వ్యాన్‌ను ఆపి, ఎవరు మీరు? ఎక్కడనుంచి వచ్చారు? వ్యాన్‌లో బియ్యం బస్తాలు ఏంటి? అని అడిగాడు. అదే సమయంలో ఒక జనసేన నాయకుడు వచ్చి వాళ్లతో సద్దిచెపుతూ మాట్లాడుతుండగా ముగ్గురు వ్యక్తులు శ్రీనును తోసేసి, వ్యాన్‌ను శివాలయం వీధి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా చింతపల్లి వైపు తరలించేశారు. ఉల్లం శ్రీను మోటార్‌సైకిల్‌పై సదరు వ్యాన్‌ను వెంబడిస్తూ పేపకాయలపాలెం గ్రామం వరకు వెళ్లాడు. అక్కడకు మోటార్ సైకిల్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు పక్కన ఉండే మళ్లల్లోకి శ్రీనును తోసేసి పలాయనం చిత్తగించారు. వ్యాన్‌ను ఫొటో తీశానని, రేషన్ బియ్యం తరలించుకుపోయిన వ్యాన్‌ను అదుపులోకి తీసుకుని, తనపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శ్రీను తెలిపాడు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

పెద్దాపురం: చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో పెద్దాపురంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం ఇంద్రజాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. డాక్టర్ బోస్ మ్యాజిక్ స్టార్ అవార్డు గ్రహీత, పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. సైన్స్ మేళవింపుగా ఇంద్రజాలం ప్రదర్శన ఆకట్టుకుంది. భారతీయ సంస్కృతిలో ఇంద్రజాలం ఒక పురాతన కళ అన్నారు. అనంతరం పలు అంశాలపై మ్యాజిక్ షో నిర్వహించారు.

కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె


సామర్లకోటలో సమ్మె కొనసాగిస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులు

సామర్లకోట: మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 29వ రోజు కొనసాగింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 7వ తేదీ నుంచి కార్మికులు సమ్మె చేస్తున్న విషయం విదితమే. మున్సిపల్ అధికారులు, పాలకుల నుంచి ఎటువంటి స్పందన లేక పోవడం, మున్సిపల్ మంత్రితో చర్చలు విఫలం కావడంతో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సమ్మె కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు మాట్లాడుతూ ఏడు నెల క్రితం సీడీఎంఏ చర్చ పేరుతో తమ సమస్యలు పరిష్కరించడానికి మూడు నెలల సమయం కోరారని, ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సీనియారిటీ ప్రాతిపదికలో వేతనాలు చెల్లించాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలనే డిమాండ్ చేశారు.

యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు

యానాం: యానాంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) నియామకం జరగకపోవడంతో ఇటీవల పేకాట, పెట్రోలు, డీజిల్, మద్యం అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా పెరిగాయని స్థానికులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితం ఎస్పీ రాజశేఖరన్ ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఎస్పీని నియమించలేదు. పుదుచ్చేరి నుంచి సైతం ఎవరూ రాకపోవడంతో కొద్ది నెలలుగా ఎస్పీ సీటు ఖాళీగా ఉంది. సీఐ, ఎస్సై స్థాయి అధికారులే పోలీసు యంత్రాంగాన్ని నడిపిస్తున్నారు. దీంతో ఉన్నత స్థాయి నిర్ణయాలు తీసుకులేకపోతున్నారు.